
నగరంలోని 12వ డివిజన్ భాస్కరపురంలోని సచివాలయం వద్ద ఎండగా ఉండటంతో ట్యాంకు కింద వేచి ఉన్న పింఛనుదారులు


పెన్షన్ కోసం ఉదయం నుంచి గూడూరు సచివాలయం ఎదుట పడిగాపులు గాస్తున్న వృద్ధులు


కృత్తివెన్ను మండలం యండపల్లి సచివాలయం వద్ద పడిగాపులు పడుతున్న పింఛను లబ్ధిదారులు

పింఛన్ల కోసం పండుటాకుల పడిగాపులు

- చంద్రబాబు కుట్రలకు పింఛనుదారుల అవస్థలు
- మండుటెండలో సచివాలయాలకు వృద్ధులు
- పలుచోట్ల అనారోగ్యానికి గురై ఆస్పత్రిపాలైన వైనం

మచిలీపట్నంటౌన్/పెడన/బంటుమిల్లి/కృత్తివెన్ను/గూడూరు: గత నెల వరకు కోడి కూయకముందే వలంటీర్లు తలుపు తట్టి పెన్షన్లు అందించేవారు. ప్రస్తుతం ఎన్నికల కమిషన్ వలంటీర్లను పెన్షన్ పంపిణీ విధుల నుంచి తప్పించడంతో ఈ నెలలో పెన్షన్ లబ్ధిదారులు మండుటెండలో కాళ్లీడ్చుకుంటూ గ్రామ సచివాలయాలకు రావాల్సివచ్చింది. సచివాలయాల్లో చాంతాడు క్యూలలో నిలబడి గంటల తరబడి పెన్షన్ కోసం నిరీక్షించాల్సి వచ్చింది. చంద్రబాబు పన్నిన కుట్రలకు వృద్ధ పింఛనుదారులు ఇబ్బందులకు గురికావాల్సి వచ్చింది. మచిలీపట్నం నగరంలోని 50 డివిజన్లలో దాదాపు 19 వేల మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. సచివాలయ అధికారులు బుధవారం ఉదయం బ్యాంకులకు వెళ్లి నగదు డ్రా చేసుకుని వచ్చి సాయంత్రం 4.30 గంటల నుంచి డివిజన్ సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. ఈ నెల ఆరో తేదీ వరకు పింఛన్ల పంపిణీ కొనసాగుతుంది. అయితే చాలామంది వృద్ధులు, వికలాంగులు మధ్యాహ్నానికే సచివాలయాలకు చేరుకుని పడిగాపులు పడ్డారు.


వంగి వంగి నడుస్తూ వస్తున్న వృద్ధురాలు

నగరంలో 48.80 శాతం పింఛన్ల పంపిణీ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీ 48.80 శాతం జరిగింది. సాయంత్రం 4.30 గంటల నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. నగరంలో 19,136 పింఛన్లు ఉండగా రాత్రి 7.30 గంటల సమయానికి 9,339 మందికి అందజేశారు. ఇంకా 9,797 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది.

చంద్రబాబు కుట్రలతో ఇబ్బందులు వచ్చాయి


చంద్రబాబు పన్నిన కుట్రలతో నేడు సచివాలయానికి వచ్చి పింఛను తీసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. చంద్రబాబు వలంటీర్లపై తప్పుడు ఫిర్యాదులు చేసి వారిని విధుల నుంచి తప్పించి మా ఉసురు కట్టుకున్నాడు. రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం.

– గోపి రామారావు, మగ్గాల కాలనీ, 36వ డివిజన్, మచిలీపట్నం

చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇబ్బందులు తప్పవు


ఈ ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తే పింఛనుదారులకు ఇబ్బందులు తప్పవు. ప్రస్తుతం సచివాలయానికి నడిచి వచ్చి పింఛను తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందంటే దీనికి చంద్రబాబే కారణం.

– శేషగిరిరావు, భాస్కరపురం, 12వ డివిజన్, మచిలీపట్నం

ఉపవాసంలో కూడా నడిచి రావాల్సి వచ్చింది


నేను రంజాన్ ఉపవాస దీక్షలో ఉండి కూడా పింఛను కోసం సచివాలయానికి వచ్చి పడిగాపులు పడాల్సి వచ్చింది. వలంటీర్లు ఉంటే ఇంటి దగ్గరకు వచ్చి ఇచ్చే వారు. చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది.

– అమీరున్నీసా, మగ్గాల కాలనీ, 36వ డివిజన్, మచిలీపట్నం

ఠంచనుగా ఇంటికి వచ్చి ఇచ్చేవారు


నా పేరు బేతాళ లక్ష్మీ నాంచారమ్మ. మాది గూడూరు. ఎర్రటి ఎండలో బయటకు రావాలంటేనే కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ముసలి ప్రాణాలను ఇబ్బంది పెడితే మా ఉసురు తగులుతుంది. ప్రతినెలా ఇచ్చినట్లు ఇంటికి తీసుకువచ్చి ఇచ్చి పుణ్యం కట్టుకోండి.

– బేతాళ లక్ష్మీ నాంచారమ్మ, గూడూరు

మూడు కిలోమీటర్ల నుంచి రావాలి


నా పేరు కూనపరెడ్డి శర్మారావు. మాది గూడూరు–2 సచివాలయం పరిధిలోని తుమ్మలపాలెం గ్రామం. వాహన సౌకర్యం కూడా లేని మా గ్రామం నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గూడూరు సచివాలయానికి రావాలంటే చాలా ఇబ్బంది.

– కూనపరెడ్డి శర్మారావు, తుమ్మలపాలెం

సచివాలయానికి రావాల్సి వచ్చింది


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే నాకు పింఛను మంజూరైంది. గత నాలుగేళ్లుగా వలంటీర్ తెల్లవారుజామునే ఇంటికి వచ్చి తలుపుతట్టి పింఛను అందజేస్తున్నాడు. ఇప్పుడు తొలిసారిగా పింఛను కోసం సచివాలయానికి రావాల్సివచ్చింది.

–బొట్ల శామ్యూల్, జనశక్తి నగర్, 12వ డివిజన్, మచిలీపట్నం



మోపిదేవిలో వృద్ధులు, వికలాంగుల అగచాట్లు

పింఛన్ కోసం వెళుతూ వృద్ధురాలికి గాయాలు

కృత్తివెన్ను: కృత్తివెన్ను మండలం యండపల్లి సచివాలయం పరిధిలోని యండపల్లి గ్రామంలో సచివాలయం వద్ద బుధవారం సాయంత్రం 5 గంటలకు సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. సమాచారం అందుకున్న మునిపెడ దళితవాడకు చెందిన నాగిని నాగులు అనే 70 ఏళ్ల వృద్ధురాలు పింఛను కోసం తన మనవడితో బైక్‌పై సచివాలయానికి బయలు దేరింది. సుమారు రాత్రి ఏడు గంటల సమయంలో వెళుతున్న వారి వాహనం యండపల్లి సమీపంలో 216 జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైంది. దీంతో నాగులుతో పాటు, ఆమె మనవడు నాగిని హేమంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికుల సాయంతో 108 వాహనంలో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చంద్రబాబు వలంటీర్లపై చేసిన కుట్ర పింఛనుదారులకు ప్రాణాలమీదకు తెస్తోందని స్థానికులు వ్యాఖ్యానించారు.

పింఛన్ల పంపిణీ ప్రారంభం


పింఛన్‌దారులతో కిటకిట లాడుతున్న నాగాయలంక-1 సచివాలయం


చేతులతో దేకుతూ వచ్చిన మరో వికలాంగుడు


మోపిదేవి గ్రామ సచివాలయం వద్ద పింఛన్లు అందుకుంటున్న వృద్ధులు

అవనిగడ్డ: మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం సాయంత్రం ప్రారంభమైంది. సచివాలయ ఉద్యోగులు ఉదయం బ్యాంకులకు వెళ్లి డబ్బులు డ్రా చేసి తీసుకొచ్చారు. 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో మరియాదేవి చెప్పారు.

నాగాయలంకలో...

నాగాయలంక సచివాలయం 1లో సాయంత్రం 4 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. అధిక సంఖ్యలో పింఛన్ దారులు తరలి రావడంతో సచివాలయ ప్రాంగణంలో రద్దీ ఏర్పడింది.

మోపిదేవిలో...

మోపిదేవి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద బుధవారం సాయంత్రం నుంచి సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభించినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని 12 గ్రామ సచివాలయాల్లోని ఆయా సచివాలయ ఉద్యోగులతో మొత్తం 6,332 మందికి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గురువారం నుంచి శనివారం వరకు ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు పింఛన్లు పంపిణీ చేస్తామని చెప్పారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయాల వద్ద టెంట్లు ఏర్పాటు చేసి కుర్చీలు, మంచినీళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, బిస్కట్లుతో పాటు వైద్య సిబ్బందిని సిద్ధం చేసినట్లు తెలిపారు. వికలాంగులు, మంచంపై లేవలేనివారికి సచివాలయ ఉద్యోగులే వారి ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందిస్తారని వివరించారు.

చంద్రబాబు కుట్రలతోనే పింఛనుదారులకు ఇబ్బందులు

మచిలీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: చంద్రబాబునాయుడు కుట్రలతోనే రాష్ట్రంలోని పింఛనుదారులకు ఇబ్బందులు తలెత్తాయని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. గడపగడపకు సంక్షేమం ప్రచార కార్యక్రమాన్ని బుధవారం నగరంలోని 48వ డివిజన్‌లో ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు కుమారుడు రామ్‌చరణ్, డివిజన్ కార్పొరేటర్ ముచ్చర్ల శైలజ, డివిజన్ ఇన్‌చార్జ్ సింగంశెట్టి గోపీవిశ్వచంద్ (చందు)లతో కలిసి నిర్వహించారు. డివిజన్‌లోని ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుని సంక్షేమ పథకాలను కొనసాగించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ శీలం భారతి, కార్పొరేటర్లు ఏకశిరి వెంకటేశ్వరరావు, మేకల సుబ్బన్న, పల్లి శేఖర్, ఐనం తాతారావు, కో-ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, శీలం బాబ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు గాజుల భగవాన్, నూకల ప్రసాద్, మిరియాల రాంబాబు, బూరగ రామారావు తదితరులు పాల్గొన్నారు.


48వ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న పేర్ని కిట్టు, సింహాద్రి రామ్‌చరణ్


పెడన పట్టణంలోని నాలుగో సచివాలయంలో పింఛను కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు


గూడూరు-2 సచివాలయంలో బారులు తీరిన పెన్షన్ దారులు

ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక

ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లింలకు దీక్ష విరామం అనంతరం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, స్నేహ సంబంధాలు, మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. స్థానిక ఇనుగుదురుపేటలోని ఎంఆర్ ఫంక్షన్ హాలులో బుధవారం రాత్రి ఎమ్మెల్యే పేర్ని నాని ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వైఎస్సార్ సీపీ మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, మచిలీపట్నం శాసనసభ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబాతో పాటు నగరంలోని వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. ఉపవాసదీక్ష అనంతరం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వీరంతా పాల్గొని అనంతరం ఇఫ్తార్ విందు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్ని నాని మాట్లాడుతూ రంజాన్ సందర్భంగా ముస్లింలకు ప్రతి ఏడాది రంజాన్ పవిత్ర మాసంలో ఇఫ్తార్ విందు ఇస్తుండటం ఆనందంగా ఉందన్నారు. నగరంలోని అన్ని మతాలకు చెందిన వారు స్నేహసంబంధాలతో మతసామరస్యం పాటిస్తూ జీవిస్తుండటం ఎంతో గర్వకారణమన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కిట్టు మాట్లాడుతూ ఉపవాసదీక్షలో ఉన్న ముస్లింలు కోరుకునే ప్రతి కోరిక నెరవేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన ముస్లిం ప్రముఖులు హాజరయ్యారు. ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలకు డాక్టర్ చంద్రశేఖరరావు, పేర్ని కిట్టు భోజనాన్ని వడ్డించారు.


ముస్లింలకు ఇఫ్తార్ విందులో వడ్డన చేస్తున్న డాక్టర్ చంద్రశేఖరరావు, పేర్ని కిట్టు


ప్రార్థన చేస్తున్న ముస్లింలు

6న గూడూరు మండల పరిషత్ సమావేశం

గూడూరు: ఈనెల 6న గూడూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎన్.ప్రేమాన్విత తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ సంగా మధుసూదనరావు అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు,అధికారులు హాజరుకావాలని కోరారు.

పింఛనుదారులకు నగదు విడుదల

ఘంటసాల: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 6,856 మంది పెన్షనర్లకు రూ.2,06,74,000 నగదు విడుదల చేసినట్టు ఎంపీడీవో బి.మారుతి శేషమాంబ తెలిపారు. ఆయా సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి వచ్చిన పెన్షనర్లు ఇబ్బందులు పడకుండా నగదు తీసుకుని వెళ్లేలా ఏర్పాట్లు చేశామన్నారు.

వీఆర్వో సస్పెన్షన్

చిలకలపూడి: నగరంలోని 11వ డివిజన్ వీఆర్వో జి.శ్రీదేవిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదే డివిజన్‌కు చెందిన తూము నాంచారయ్య తనకు పట్టాను మంజూరు చేశారని, అయితే పట్టాలో హద్దులు రాయకుండా పట్టా ఇచ్చారని ఆర్డీవో ఎం.వాణికి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేసిన అధికారులు వీఆర్వో శ్రీదేవిని సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నారు.

విగ్రహ పునఃప్రతిష్ఠకు హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ హారిక దంపతులు

పెడన: మండల పరిధిలోని బల్లిపర్రు పంచాయతీ

సంక్షిప్త వార్తలు

పాతబల్లిపర్రు గ్రామంలో ఉన్న శ్రీకోదండ రామాలయంలో స్వామివార్ల విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఉదయం వేకువ జామున అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు దంపతులతో ప్రత్యేక పూజలు, హోమాలను వేదపండితులు నిర్వహింపజేశారు. పెడన వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఉప్పాల రమేష్(రాము), జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామపెద్దలు, పార్టీ నాయకులు సమ్మెట సత్యనారాయణ, దాసరి వసంతరావు, వాసన సురేష్, మేకా రవీంద్రకుమార్, పామర్తి బెనర్జీ, గరికపాటి వెంకట రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

నూతన విగ్రహ ప్రతిష్ఠ

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని ఆరవ వార్డు గౌడపాలెంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీరాముని విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయంలో ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.కార్యక్రమంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, రాజులపాటి ప్రసాద్, సూరగం రామకృష్ణతో పాటు పలువురు గౌడ సంఘం నేతలు, ప్రముఖులు పాల్గొన్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ ముమ్మరంగా తనిఖీలు

పెడన: పెడన నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు బుధవారం ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి. పెడన – గుడివాడ రోడ్డులో ద్విచక్ర వాహనాలను, కార్లను, మినీ లారీలను తనిఖీలు చేయడంతో పాటు పలు మినీ లారీలలో ఏ లోడు తీసుకువెళ్తున్నదీ, వాటికి సంబంధించిన బిల్లులు సక్రమంగా ఉన్నది లేదని పరిశీలించారు.

ప్రేరణ ఉత్సవ్ మండల స్థాయి పోటీలు

బంటుమిల్లి: ప్రేరణ ఉత్సవ్ – 2024 మండల స్థాయి పోటీల్లో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎంఈఓలు త్రిపుర సుందరీదేవి, వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో పలు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, పద్యపఠనం, కథలు చెప్పటం, పాటలు పాడటం తదితర అంశాల్లో పోటీలు నిర్వహించారు. సీహెచ్ విశ్వనాథ్, ఎస్.ప్రజ్ఞ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

మొరకనపల్లి(మోపిదేవి): మండల పరిధిలోని మొరకనపల్లి గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మోపిదేవి మండల శాఖ ఆధ్వర్యంలో బుధవారం చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. సుమారు 200 మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు సొసైటీ మండల శాఖ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు తెలిపారు.

క్లుప్తంగా

ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా కేయూ

ఉపకులపతి జ్ఞానమణి



కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఎన్ఎస్ఎస్ విభాగం పనిచేయాలని ఉపకులపతి ఆచార్య జి.జ్ఞానమణి పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన షాహిద్ దివస్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విశ్వవిద్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కోరారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఎం.శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.శోభన్ బాబు, ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రధాన ఆచార్యులు ఆచార్య సుందరకృష్ణ , ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి, ఎన్‌సీసీ అధికారి రామశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు పాల్గొన్నారు. తొలుత ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన స్వచ్ఛ్ క్యాంపస్ కార్యక్రమంలో ఉపకులపతి, రిజిస్ట్రార్ పాల్గొన్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షలో అర్హత



ఘంటసాల: జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో ఘంటసాలకు చెందిన విద్యార్థి కొడాలి ఏకాంక్షత్ అర్హత సాధించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థి గత జనవరిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు హాజరయ్యాడు. ఈ సందర్భంగా ఏకాంక్షత్‌ను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఏపీటీఎఫ్-1938 ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గం

బంటుమిల్లి: ఏపీటీఎఫ్–1938 ఉపాధ్యాయ సంఘ మండల కమిటీ నూతన కార్యవర్గ నియామకం బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడు కొల్లా శేషగిరి పర్యవేక్షణలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడిగా సీహెచ్ సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా తాతా రేణుకారావు నాలుగవసారి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పడమటి రామచంద్రరావు, పీటీవీఎస్ఆర్ స్వామి, గౌరవాధ్యక్షుడు పి.స్టాన్లీజోన్స్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. స్వామి మాస్టారు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. కె.నారాయణ, పి.స్వర్ణలత, కె.నాగరాజు, కె.వసంతరావు, పి.రజనికుమారి, టి.సుందరరాజులను సభ్యులుగా ఎన్నుకున్నారు. అనంతరం పలు తీర్మానాలను ఆమోదించారు.

మహా కుంభాభిషేకం మహోత్సవాలు ప్రారంభం

పెడన: పట్టణంలో ఉన్న శ్రీవాసవి క్షేత్రంలోని శ్రీవాసవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 50 సంవత్సరాలు(స్వర్ణోత్సవం)పూర్తయిన సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహా కుంభాభిషేకం మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా పర్యవేక్షణలో మహాకుంభాభిషేకం, విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. పూజా కార్యక్రమాలను ద్విశతాధిక ప్రతిష్ఠాచార్య స్వర్ణ శ్రీనివాస్ శర్మ, శ్రీవాసవి క్షేత్రం ప్రధాన అర్చకుడు స్వర్ణ సాయిబాబు, 15 మంది రుత్వికులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవాధ్యక్షుడు తమ్మన వెంకట సుబ్బారావు, సంఘ నాయకులు సురేష్ కుమార్, నరసింహారావు, పశుపతినాథ్ బాబు, రాంబాబు, శ్రీనివాస్ గుప్తా, ఆర్యవైశ్య సంఘ మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

అమలేశ్వరమ్మ తల్లి సంబరం

పెడన: కొంకేపూడి గ్రామంలో శలపాటి వారి ఇలవేల్పు శ్రీఅమలేశ్వరి తల్లి సంబరాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సంబరాలు ఈ నెల ఏడో తేదీ వరకు కొనసాగుతాయని శలపాటి కుటుంబీకులు తెలిపారు. ఈ సంబరాలను పురస్కరించుకుని అమలేశ్వరి ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు డప్పు నృత్యాలను ఏర్పాటు చేశారు. శలపాటి ఆడపడుచులు, కుటుంబీకులు ఈ సంబరాలలో మొక్కుబడులు తీర్చుకుంటారని వారు తెలిపారు.

35 మంది వలంటీర్ల రాజీనామాలు



బంటుమిల్లి: మండల పరిధిలోని పలు సచివాలయాలకు చెందిన వలంటీర్లు బుధవారం మూకుమ్మడిగా తమ రాజీనామాలను ఎంపీడీఓ రామకృష్ణరాజుకు అందజేశారు. ప్రజలకు స్వచ్ఛందంగా సేవలందిస్తున్న తమపై అసత్య ఆరోపణలు చేసి ఎన్నికల కమిషన్‌కు టీడీపీ నాయకులు వారి అనుచరులతో ఫిర్యాదు చేయడంపై నిరసన వ్యక్తం చేస్తూ తామంతా రాజీనామాలు చేస్తున్నట్లు వారు తెలిపారు. రాజీనామాలు చేసిన వారిలో బంటుమిల్లి, నాగేశ్వరరావుపేట, ముంజులూరు గ్రామాల వలంటీర్లు ఉన్నారు.